సాక్షి విశాఖపట్నం

శుక్రవారం । 12 ఏప్రిల్ । 2024



బతికి సాధించు

ఓడినంత మాత్రాన జీవితం వృథా అనుకుంటే భవిష్యత్తు శూన్యంలా కనిపిస్తుంది. ఆత్మ విశ్వాసానికి మించిన విజయం లేదు. 8లో



బడుగుల ఆశాజ్యోతి పూలే

జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ మీటింగ్ హాలులో పూలే జయంతి కార్యక్రమం జరిగింది. 8లో



ప్రయాణికుల కోసం స్పెషల్ రైళ్లు

వేసవి రద్దీ దృష్ట్యా ప్రయాణికుల కోసం ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం వెల్లడించారు. 8లో

ఈద్ ముబారక్



ఆలింగనం చేసుకుంటున్న చిన్నారులు



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



నమాజ్‌లో పాల్గొన్న వైఎస్సార్ సీపీ దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి, డాక్టర్ జహీర్ అహ్మద్, శ్రీవత్సవ్

డాబాగార్డెన్స్: జిల్లాలోని ముస్లింలు రంజాన్ పండగను అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. బుధవారం రాత్రి నెలవంక దర్శనంతో ఉపవాసాలు విరమించారు. గురువారం మసీదులు, ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముస్లింలందరూ సంతోషంగా ఓ చోటకు చేరుకుని ఈద్–ఉల్–ఫితర్ జరుపుకున్నారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. జగదాంబ జంక్షన్ సమీపంలోని మక్కా మసీదుకు ముస్లింలు పెద్ద సంఖ్యలో హాజరై ప్రార్థనలు నిర్వహించారు. మత పెద్దలు ఖురాన్ చదివి వినిపించారు. మత బోధకులు రంజాన్ పవిత్ర మాసంలో పొందే ప్రతిఫలాలు వివరించారు. ఈద్ నమాజ్‌కు ముందు పేదలు, అనాథలకు ఫిత్రా, జకాత్



దానాలు చేశారు. ముస్లిం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో విశాఖ మహిళా డిగ్రీ కళాశాలకు ఎదురుగా గల సర్వీస్ రోడ్డులో ఈదుల్ ఫితర్ నమాజ్ నిర్వహించారు. సర్వమత సమానత్వం, ప్రపంచ శాంతి, సౌభ్రాతృత్వం ఆకాంక్షిస్తూ ప్రార్థనలు జరిగాయి. ముస్లిం వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు హైదర్ అలీ సింకా, ఉపాధ్యక్షుడు మీర్ అబ్బాస్ హుస్సేన్, కార్యదర్శి అబీర్‌జాన్ తదితరులు పాల్గొన్నారు.



కోటవీధి గ్రౌండ్లో నమాజ్ చేస్తున్న ముస్లింలు







నమాజ్‌లో పాల్గొని ఆలింగనం చేసుకుంటున్న విదేశీ ముస్లింలు

పార్లమెంట్‌లో బొత్స ఝూన్సీ
'విశాఖ విజన్'

- అప్పట్లోనే నగర అభివృద్ధిపై ప్రస్తావన
- పలు సమస్యలపై గళం



సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్ సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బొత్స ఝూన్సీ లక్ష్మి ఉన్నత విద్యావంతురాలు. 2006లో బొబ్బిలి లోక్‌సభ సభ్యురాలిగా, 2009లో విజయనగరం ఎంపీగా గెలుపొందారు. ప్రస్తుత ఎన్నికల్లో విశాఖ ఎంపీగా పోటీ చేస్తున్న ఆమె.. 2009లోనే 'విశాఖ విజన్' పేరిట నగర అభివృద్ధిపై ఆమె పార్లమెంట్‌లో పలుమార్లు ప్రస్తావించారు. స్టీల్‌ప్లాంట్‌కు మైన్స్ కేటాయించాలని, విశాఖలో డిశాలినేషన్ ప్రాజెక్టును ఏర్పాటు చేయాలని, బీహెచ్‌పీవీకి పునరుద్ధరణ ప్యాకేజీ ఇవ్వాలని, హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్‌ను రక్షించాలని, మెట్రోలైన్, భోగాపురం ఎయిర్‌పోర్టు వంటి వాటిపై లోక్‌సభలో గళమెత్తారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు 'ఉక్కు మహిళ'గా పోరాటం

విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు బొత్స ఝూన్సీ లక్ష్మి అప్పట్లోనే గళం విప్పారు. స్టీల్‌ప్లాంట్‌కు కాప్టివ్ మైన్స్‌ను కేటాయించాల్సిందిగా లోక్‌సభలో గట్టిగా డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్‌కు ముడి పదార్థాల కొరత తీవ్రంగా ఉందని.. దీని వల్ల ఉత్పత్తి ఖర్చు పెరుగుతోందన్నారు. కాప్టివ్ మైన్స్ కేటాయించడం ద్వారా ఈ సమస్యను పరిష్కరించవచ్చని ఆమె కేంద్రానికి సూచించారు. ప్రైవేట్ సంస్థలకే సొంతంగా మైన్స్ ఉన్నప్పుడు ప్రభుత్వ రంగ సంస్థ అయిన విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయిస్తే సంస్థ మనుగడ కొనసాగుతుందని అప్పుడే కేంద్రాన్ని కోరారు. కాగా.. కేంద్ర బీజేపీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించాలని నిర్ణయం తీసుకోవడంతో ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు 1,155 రోజులుగా ఆందోళన చేస్తున్నారు. వీరి ఆందోళనకు వైఎస్సార్ సీపీ మద్దతు ఇచ్చి.. ప్రత్యక్ష ఆందోళనలో పాల్గొంది. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి లేఖ కూడా రాశారు. ముఖ్యమంత్రి రాసిన లేఖపై ఎటువంటి చర్యలు తీసుకున్నారని హైకోర్టు సైతం కేంద్రాన్ని ప్రశ్నించింది. ఇటువంటి పరిస్థితుల్లో విశాఖ ఎంపీగా పోటీ చేస్తున్న ఆమె స్టీల్‌ప్లాంట్ పరిరక్షణే తన ధ్యేయమని స్పష్టం చేశారు. విశాఖ ఉక్కు– ఆంధ్రుల హక్కు అని.. తనను ఎంపీగా గెలిపిస్తే ఈ ప్రాంత ఆడపడుచుగా స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు పార్లమెంట్‌లో ఉద్యమిస్తానన్నారు. విశాఖ ప్రజల సెంటిమెంట్‌ను కాపాడతానని.. వేలాది ఎకరాల భూములిచ్చిన ఈ ప్రాంత ప్రజల త్యాగాన్ని వృథాకానివ్వనని చెప్పారు.

వైజాగ్‌కు
ది వరల్డ్



ది వరల్డ్ క్రూయిజ్ షిప్

- ఈనెల 29న రానున్న ఇంటర్నేషనల్ క్రూయిజ్ షిప్
- విశాఖ నుంచి చెన్నై మీదుగా పోర్టుబ్లెయిర్‌కు పయనం
- ఆగస్ట్‌లో కార్డిలియా క్రూయిజ్ రాక

సాక్షి, విశాఖపట్నం: విహార ప్రపంచానికి విశాఖ మరోసారి ముహూర్తం సిద్ధం చేసుకుంది. విశాఖపట్నం పోర్టు అథారిటీ(వీపీఏ)లో నిర్మించిన క్రూయిజ్ టెర్మినల్ నుంచి మొట్టమొదటి క్రూయిజ్ సర్వీసు ప్రారంభంకానుంది. విశాఖ నుంచి చెన్నై మీదుగా పోర్టు బ్లెయిర్‌కు సర్వీసు నడిపేందుకు 'ది వరల్డ్ ఇంటర్నేషనల్ క్రూయిజ్' సిద్ధమవుతోంది. ఈనెల 29న ఈ ఇంటర్‌నేషనల్ క్రూయిజ్ షిప్ విశాఖ చేరుకోనుంది. రేట్లు, బెర్తింగ్ టైమ్స్ తదితర అంశాలపై చర్చించేందుకు త్వరలో విశాఖ పోర్టుకు 'ది వరల్డ్' సంస్థ ప్రతినిధులు రానున్నారు.

70 మంది ప్రయాణికులతో 'ది వరల్డ్'

మొత్తం 11 అంతస్తుల క్రూయిజ్ షిప్ 'ది వరల్డ్' ఈనెల 29వ తేదీ ఉదయం 8 గంటలకు విశాఖ పోర్టుకు చేరుకోనుంది. ఈ షిప్‌లో 300 మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తుంటారు. మొత్తం 70 మంది విదేశీ ప్రయాణికులతో విశాఖ చేరుకోనుంది. విశాఖ పోర్టు నుంచి 30వ తేదీ సాయంత్రం 4 గంటలకు బయలుదేరనుంది. చెన్నైకు రెండు రోజుల్లో చేరుకొని.. అక్కడి నుంచి పోర్టు బ్లెయిర్‌కు మరో మూడు రోజుల్లో చేరుకునేలా ఈ సర్వీసును నడుపుతున్నారు. ఇక షిప్‌లో అత్యాధునిక సౌకర్యాలతో పాటు ఫన్, ఎంటర్‌టైన్‌మెంట్, షాపింగ్ మాల్స్, లైవ్‌షోలు ఉంటాయి. చిన్నారుల కోసం ప్రత్యేక ఫన్ కార్యక్రమాలను కూడా నిర్వహిస్తారు.

ఆగస్ట్‌లో కార్డిలియో సర్వీసులు..

మరోవైపు.. గతంలో ఇక్కడి నుంచి ఆరు నెలల పాటు చెన్నైకు సర్వీసులు నడిపించిన ఎంప్రెస్ సంస్థకు చెందిన కార్డిలియో క్రూయిజ్ షిప్.. మరోసారి పర్యాటకులకు కనువిందు చేయనుంది. ఈ షిప్ ఆగస్ట్ నుంచి సర్వీసులు నడపనుంది. ప్రతి మూడు రోజులకోసారి రోజు విడిచి రోజు నడిపించేలా పోర్టు అధికారులు బెర్తులు అందించనున్నారు. ఈ క్రూయిజ్.. 3 నెలల పాటు విశాఖ నుంచి సర్వీసులు నడపనున్నట్లు పోర్టు వర్గాలు వెల్లడించాయి.

టెర్మినల్‌కు తొలి క్రూయిజ్ రాక

తూర్పు తీరంలోని తొలి క్రూయిజ్ టెర్మినల్‌ని గతేడాది సెప్టెంబర్‌లో ప్రారంభించారు. రూ.96.05 కోట్లతో క్రూయిజ్ బెర్త్, టెర్మినల్ బిల్డింగ్ నిర్మించారు. నిర్మాణ పనుల్ని ఏడాదిన్నర క్రితం ప్రారంభించారు. ప్రపంచ పర్యాటకులు క్రూయిజ్‌లో వచ్చి.. విశాఖ మహా నగరంలో పర్యటించే విధంగా వివిధ ఏర్పాట్లు చేశారు. 2500 చదరపు మీటర్ల టెర్మినల్ బిల్డింగ్‌తో పాటు విదేశీ యాత్రికులకు కావాల్సిన సకల సౌకర్యాలు అందుబాటులోకి తీసుకొచ్చారు. తొలిసారిగా ఈ టెర్మినల్‌కు క్రూయిజ్ సర్వీసు రానుండటంతో.. ఏర్పాట్లపై పోర్టు అధికారులు ఇప్పటి నుంచే ప్రణాళికలు ప్రారంభించారు.



విశాఖలోని క్రూయిజ్ టెర్మినల్

పల్లాపై ఫైర్

- గాజువాకలో టీడీపీని రక్షించాలని అచ్చెన్నాయుడుకి సీనియర్లు ఫిర్యాదు
- ఇలా అయితే ఓటమి తప్పదని ఆందోళన



అచ్చెన్నాయుడుకు ఫిర్యాదు అందజేస్తున్న టీడీపీ గాజువాక సీనియర్ నాయకులు

గాజువాక : గాజువాక నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు తీరుతో పార్టీ ఇబ్బందుల్లో పడిందని ఆ పార్టీ సీనియర్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ ఆవిర్భావం నుంచి గాజువాకలోని వివిధ వార్డుల్లో పనిచేస్తున్న సుమారు 85 మంది నాయకులు.. పార్టీ సీనియర్ నాయకుడు టి.హర్షవర్థన్ ప్రసాద్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం జిల్లా నిమ్మాడలో ఆ పార్టీ అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడును గురువారం కలిసి ఫిర్యాదు చేశారు. గాజువాకలో టీడీపీని రక్షించాలని అభ్యర్థించారు. పార్టీని బలోపేతం చేయడంలో పల్లా శ్రీనివాసరావు పూర్తిగా విఫలం చెందారని ఆరోపించారు. పల్లా పని తీరు, ప్రస్తుతం కొనసాగుతున్న ఎన్నికల ప్రచారంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఆయన గాజువాక అభ్యర్థిగా ఉన్నప్పటికీ .. ప్రవర్తనలో ఎటువంటి మార్పు రాలేదని వివరించారు. సీనియర్ నాయకులను, పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న వారిని కలుపుకోవడంలేదని, సమన్వయం పూర్తిగా దెబ్బతిందని పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను విస్మరిస్తున్నారన్నారు. ఆయన ప్రవర్తన ఈ విధంగా ఉంటే రానున్న ఎన్నికల్లో గెలుపు ఎలా వస్తుందో ఆలోచించాలని కోరారు. ఆయన మొండిగా, మూర్ఖంగా ప్రవర్తిస్తున్నారని, దీనివల్ల చాలా మంది పార్టీకి దూరమవుతున్నారని తెలిపారు. పార్టీపై అభిమానం ఉన్నప్పటికీ ఆయన ప్రవర్తన నచ్చక పార్టీ మారిపోతున్నారన్నారు. పల్లా శ్రీనివాసరావు తీరు, ప్రవర్తన మార్చుకోకపోతే గాజువాక నియోజకవర్గంలో టీడీపీ గెలుపు అసాధ్యమని స్పష్టం చేశారు. ఫిర్యాదు చేసినవారిలో నాయకులు పొంద్రంగి జయరాజు, కర్రి ఈశ్వరరావు, బొడ్డు రమణ, అండుబోయిన గురుమూర్తి, పి.ధనరాజు, నెల్లి శ్రీనివాస్, బంధం అప్పలరాజు, మామిడి నర్సింగరావు, రాజన్‌రాజు, నాయుడు, దేవుపల్లి సీతారామ్ తదితరులున్నారు.

ఎన్నికల ఏర్పాట్లపై సంతృప్తి

- జిల్లాలో పర్యటించిన రాష్ట్ర ఎన్నికల పరిశీలకుడు రామ్మోహన్ మిశ్రా
- తనిఖీల పేరుతో సామాన్య పౌరులకు అసౌకర్యం కలిగించొద్దని సూచన



కలెక్టరేట్‌లో రికార్డ్స్‌ను పరిశీలిస్తున్న పరిశీలకుడు రామ్మోహన్ మిశ్రా, చిత్రంలో కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట/గాజువాక/కూర్మన్నపాలెం: రాష్ట్ర ఎన్నికల సాధారణ పరిశీలకుడు రామ్మోహన్ మిశ్రా గురువారం జిల్లాలో పర్యటించారు. రాజమండ్రి నుంచి రోడ్డు మార్గం ద్వారా జిల్లాకు చేరుకున్న ఆయన్ని కలెక్టర్ ఎ.మల్లికార్జున, పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ అగనంపూడి వద్ద కలిసి స్వాగతం పలికారు. అనంతరం ఎన్నికల పరిశీలకుడు అగనంపూడి వద్ద ఏర్పాటు చేసిన తనిఖీ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ అధికారులు చేపడుతున్న చర్యలపై ఆరా తీశారు. అక్కడ నుంచి గాజువాక ఆర్వో కార్యాలయానికి చేరుకుని అక్కడ పరిస్థితిని గమనించారు. కంట్రోల్ రూమ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ తనిఖీల్లో సామాన్య పౌరులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం రామ్మోహన్ మిశ్రా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. జేసీ కె.మయూర్ అశోక్, డీఆర్వో కె.మోహన్‌కుమార్ ఆయనకు స్వాగతం పలికారు. కలెక్టరేట్ కాంప్లెక్స్‌లోని ఏర్పాటు చేసిన వివిధ కంట్రోల్ రూమ్‌లు, అనుమతి జారీ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. సింగిల్ విండో డెస్క్, మీడియా మానటరింగ్ సెంటర్, సోషల్ మీడియా సెంటర్, 24X7 కంట్రోల్ రూమ్, ఎంసీఎంసీ తదితర కేంద్రాలను సందర్శించారు. ఆయా కేంద్రాల్లో అధికారులు చేపడుతున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్లను తనిఖీ చేశారు. పలు అంశాలను కలెక్టర్ పరిశీలకుడికి క్షుణ్ణంగా వివరించారు. జిల్లాలో చేపడుతున్న చర్యలపై రామ్మోహన్ మిశ్రా సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎంసీసీ జిల్లా నోడల్ అధికారి, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ, నోడల్ అధికారులు ఉన్నారు.

అమెరికా ఎఫ్‌ఎల్‌ఎల్ పోటీలకు వారిజా విద్యార్థులు



పోటీలకు ఎంపికైన విద్యార్థులు

కొమ్మాది : ఫస్ట్ లెగో లీగ్ (ఎఫ్‌ఎల్‌ఎల్) రోబోటిక్స్ పోటీలు ఈ నెల 17 నుంచి 20 వరకు అమెరికాలోని హూస్టన్‌లో నిర్వహించనున్నారు. ఈ పోటీలకు భీమిలి బీచ్ రోడ్డు వారిజా నేత్ర విద్యాలయంలో విద్య అభ్యసిస్తున్న ఆరుగురు అంధ విద్యార్థులు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. స్పందన, ధనలక్ష్మి, రవి, గాయత్రి, సుప్రియ, సంజయ్ పోటీలకు ఎంపికైనట్లు వెల్లడించారు. ఇటీవల గోవాలో జరిగిన ఎఫ్ఎల్ఎల్ రోబోటిక్స్ పోటీల్లో ఐదు దేశాలకు చెందిన విద్యార్థులు పాల్గొనగా.. ఇక్కడి నేత్ర విద్యాలయం విద్యార్థులు టీమ్ చాంపియన్‌షిప్ సాధించారు. అమెరికాలో పోటీల అనంతరం ఈ నెల 28న ఆశ్రమానికి వారు రానున్నారని ప్రెసిడెంట్ పీఎస్ఎన్ రాజు తెలిపారు.

భారీగా చోరీ సొత్తు స్వాధీనం

- నగరంలో మార్చి నెలలో 86 చోరీ కేసుల నమోదు
- రూ.70.66 లక్షలు సొత్తు చోరీ
- 57 కేసులను ఛేదించిన పోలీసులు
- రూ.11.34 లక్షలు నగదు, 450 గ్రాముల బంగారం, 18 బైకుల స్వాధీనం
- రూ.1.12 కోట్లు విలువ చేసే 2,160 మొబైల్స్ రికవరీ
- మీడియాతో డీసీపీ(క్రైమ్) వెంకటరత్నం



స్వాధీనం చేసుకున్న సొత్తును చూపిస్తున్న డీసీపీ(క్రైమ్) వెంకటరత్నం



రికవరీ చేసిన మొబైల్స్, వాటిని తీసుకొనేందుకు వచ్చిన ఫిర్యాదుదారులు

విశాఖ సిటీ: నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో భారీగా చోరీ సొత్తును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గత నెలలో నగరంలో 86 చోరీ కేసులు నమోదు కాగా.. వాటిలో 57 కేసులను ఛేదించినట్లు డీసీపీ(క్రైమ్) వెంకటరత్నం తెలిపారు. గురువారం పోలీస్ సమావేశ మందిరంలో జరిగిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ గత మార్చి నెలలో మొత్తం రూ.70,66,680 విలువైన బంగారం, వెండి, బైకులు, వాహనాలు, మొబైల్స్ చోరీకి గురయ్యాయని పలు స్టేషన్లలో కేసులు నమోదైనట్లు చెప్పారు. వీటిపై దర్యాప్తునకు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఆదేశాల మేరకు జాయింట్ సీపీ ఫకీరప్ప పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. సాంకేతిక సహాయంతో అన్ని కోణాలలో దర్యాప్తు చేపట్టి 52 కేసులను ఛేదించి 57 మంది నిందితులను అరెస్టు చేశామన్నారు. నిందితుల నుంచి రూ.11.34 లక్షల నగదు, 450 గ్రాముల బంగారం, 99 గ్రాముల వెండి, ఒక టాటా ఏస్ వ్యాన్, 18 బైక్‌లు, మూడు కంటైనర్లు, 8 బ్యాటరీలు, 11 మొబైల్స్ ఇలా మొత్తంగా రూ.37,77,950 విలువ చేసే సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అలాగే ఇప్పటి వరకు రూ.1.12 కోట్లు విలువ చేసే 2160 మొబైల్స్‌ను రికవరీ చేసినట్లు తెలిపారు. వీటిలో 1412 మొబైల్స్ ఫిర్యాదుదారులకు అప్పగించామన్నారు. నగరంలో నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

ఒకవైపు నేరాలు జరుగుతున్న తీరు, సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు 292 అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. అలాగే మరోవైపు నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో ప్రత్యేక పెట్రోలింగ్ ఏర్పాటు చేశామన్నారు. అలాగే హిస్టరీ షీట్ కలిగిన ఉన్న 59 మందిని బైండోవర్ చేశామన్నారు.

ఏం కష్టమొచ్చిందో?

- ఎస్‌పీఎఫ్ కానిస్టేబుల్ ఆత్మహత్య
- ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్‌లో గార్డుగా విధులు
- బ్యాంకులోనే ఎస్ఎల్ఆర్ రైఫిల్‌తో కాల్చుకున్న శంకరరావు
- భర్త మృతదేహాన్ని చూసి భార్య కన్నీరుమున్నీరు
- ఆర్థిక వ్యవహారాలే కారణమై ఉండొచ్చని భావిస్తున్న పోలీసులు



రక్తపుమడుగుల్లో శంకరరావు



శంకరరావు కుమార్తె, కుమారుడు



మృతుడి భార్య శ్రావణిని ఓదారుస్తున్న పోలీసులు

సీతమ్మధార: ప్రభుత్వ ఉద్యోగం.. సంతోషకరమైన కుటుంబం.. ఏం కష్టమొచ్చిందో.. తెల్లవారుజామున విధుల్లో ఉన్న స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ కానిస్టేబుల్ ఎస్ఆర్ఎల్ రైఫిల్‌ను గుండెకు గురిపెట్టుకుని కాల్చుకున్నాడు. క్షణాల్లోనే కుప్పకూలిపోయి ప్రాణాలు విడిచాడు. ఈ ఘటన మొత్తం బ్యాంక్‌లోని సీసీ కెమెరాల్లో రికార్డయింది. కానిస్టేబుల్ ఆత్మహత్య దృశ్యాలు ప్రతీ ఒక్కరి మనసును కలచివేశాయి. విధులు ముగించుకుని ఇంటికొస్తాడనుకున్న భర్త మరణవార్త తెలియడంతో భార్య గుండె పగిలిపోయింది. బ్యాంకులో రక్తపు మడుగులో విగత జీవిగా పడి ఉన్న భర్తను చూసి ఆమె కన్నీరుమున్నీరుగా విలపించింది. తల్లి ఎందుకు రోదిస్తుందో తెలియని వయసులో చిన్నారులు పడిన వేదనను చూసిన వారి హృదయాలు ద్రవించిపోయాయి. స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న పాలవలస శంకరరావు(37) విధి నిర్వహణలో ఎస్ఎల్ఆర్ గన్‌తో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పోలీస్ వర్గాల్లో సంచలనం రేపింది. వివరాలివీ..

విజయనగరం జిల్లా వంగర మండలం కొట్టిశ గ్రామానికి చెందిన పాలవలస శంకరరావు భార్య శ్రావణి, కుమారుడు కిశోర్‌చంద్రదేవ్(6) కుమార్తె జ్ఞానవిత(3)తో కలసి మద్దిలపాలెంలో నివాసం ఉంటున్నాడు. 2010 బ్యాచ్‌కు చెందిన శంకరరావు(3908) స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. ద్వారకానగర్‌లో జ్యోతి బుక్ డిపో గ్రౌండ్ ఫ్లోర్‌లోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌లో చెస్ట్‌గార్డ్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం ఉదయం 5.55 గంటల సమయంలో తన వద్ద ఉన్న ఎస్ఎల్ఆర్ గన్‌తో గుండెపై గురి పెట్టుకొని ముందుకు వంగి కాల్చుకున్నాడు. ఈ శబ్దం విన్న తోటి ఉద్యోగులు చూసే సరికి శంకరరావు రక్తపు మడుగుల్లో పడి ఉన్నాడు. మృతి చెందినట్లు గుర్తించిన ఉద్యోగులు వెంటనే అధికారులకు సమాచారం ఇచ్చారు. ద్వారకా ఏసీపీ రాంబాబు, సీఐ ఎస్.రమేష్, ఎస్ఐ ధర్మేంద్రతో పాటు స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ అధికారులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. భార్యకు సమాచారం ఇవ్వడంతో ఆమె పిల్లలతో ఘటనా స్థలం వద్దకు చేరుకుని రక్తపు మడుగులో ఉన్న భర్త మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరైంది. క్లూస్ టీం వేలి ముద్రలు సేకరించింది. సీఐ ఎస్.రమేష్ సీసీ ఫుటేజీలను పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఈ ఘటనపై ఏసీపీ ఆధ్వర్యంలో సీఐ దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలపై అన్ని కోణాల్లో విచారిస్తున్నారు. అయితే ఆర్థిక వ్యవహారాలే ఆయన ఆత్మహత్య కారణమై ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం కొట్టిశ గ్రామానికి ఆయన మృతదేహాన్ని తరలించారు.

టీడీపీ బరితెగింపు


గంటా, భరత్ స్టిక్కర్లతో ఉన్న స్వీట్ బాక్సులు


మసీదులో ముస్లింలతో గంటా కుమారుడు రవితేజ

- మసీదులో ఎన్నికల ప్రచారం
- గతంలో ఏం చేశారని నిలదీసిన పెద్దలు
- పార్టీ నేతల ఫొటోలతో స్వీట్ల పంపిణీ
- ఎన్నికల నియమావళికి తూట్లు

మధురవాడ: భీమిలి నియోజకవర్గం పరిధిలోని మధురవాడలో టీడీపీ ప్రలోభాల పర్వానికి తెరతీసింది. ఎన్నికల ప్రచారానికి మసీదులను వేదిక చేసుకుని నియమావళికి తూట్లు పొడిచింది. రంజాన్ సందర్భంగా గురువారం మధురవాడ శివశక్తినగర్‌లోని ఓ మసీదుతో పాటు ఇతర ప్రాంతాల్లో టీడీపీ నేతల ఫొటోలతో కూడిన 500 పైగా స్వీట్ ప్యాకెట్స్ పంపిణీ చేశారు. ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపే నెపంతో మసీదులోకి పార్టీ కండువాలతో ప్రవేశించారు. భీమిలి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గంటా శ్రీనివాసరావు, ఎంపీ అభ్యర్థి భరత్ ఫొటోలతో ఉన్న స్టిక్కర్లు అంటించి మరీ స్వీట్ బాక్సులు పంపిణీ చేశారు. వీటిని గంటా కుమారుడు రవితేజ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు మొల్లి లక్ష్మణరావు, నమ్మి శ్రీను తదితరులు అందజేశారు. పండగ రోజు కూడా చీఫ్ పాలిటిక్స్ ప్లే చేశారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడానికి స్థానికులు సిద్ధమయ్యారు.

గతంలో ఏం చేశారు? : ముస్లింల సంక్షేమం కోసం గంటా శ్రీనివాసరావు మంత్రిగా ఉన్నప్పుడు కూడా చేసింది ఏమీ లేదు.., మళ్లీ ఓట్లు వేయాలని ఎలా వచ్చారంటూ హజరత్ ముక్తియార్ అలీ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు అహ్మద్, ఇతర ముస్లిం మత పెద్దలు టీడీపీ నాయకులను ప్రశ్నించారు. షాదీఖానా నిర్మాణానికి రూ. 20 లక్షలు మంజూరైనా స్థలం చూపించని కారణంగా ఆ నిధులు వెనక్కి వెళ్లిపోయాయన్నారు. మారికవలస ఆర్‌జీకే కాలనీ ముస్లిం శ్మశాన వాటికకు రోడ్డు వేయకుండా టీడీపీ అనుచరుడే అడ్డుకుంటున్నాడని.. ఇంకా ఇంత కంటే ఏం చెప్పాలంటూ నిలదీశారు. దీంతో భవిష్యత్‌లో వచ్చేది టీడీపీ ప్రభుత్వమే.. అన్ని చేస్తామంటూ టీడీపీ నాయకులు అక్కడి నుంచి చల్లగా జారుకున్నారు.

డబ్బు కోసమే వివాహిత హత్య

సీతమ్మధార: ద్వారకానగర్‌కు చెందిన వివాహిత ఈశ్వరి హత్య కేసులో ఇద్దరిని ద్వారకా పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడు షేక్ సయ్యద్ అలీతో ఈశ్వరి(33)కి పరిచయం ఉంది. దీంతో అలీ తాను పని చేస్తున్న ఓ బీమా కంపెనీలో ఆమెతో ఇన్సూరెన్స్ చేయించాడు. నగదు విషయంపై ఆమె మాట వినడం లేదని ఈ నెల 8న ఆమెను బీమా సంస్థకు తీసుకెళ్లాడు. అక్కడి నుంచి ఏయూ పరిసర ప్రాంతానికి తీసుకెళ్లిన సయ్యద్.. తన స్నేహితుడు జితేంద్ర సబత్‌ను పిలిచాడు. ఆమెను హత్య చేస్తే రూ. 27 లక్షల బీమా వస్తుందన్న ఆశతో అక్కడ నుంచి రైల్వేన్యూకాలనీ శ్రీనివాసనగర్‌లోని తన ఇంటికి అలీ తీసుకెళ్లాడు. అక్కడ ఆమెను హత్య చేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. ఇద్దరినీ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ఎస్.రమేష్ తెలిపారు.

బతికి సాధించు

వలలో చిక్కుకున్న చేపపిల్ల చివరి నిమిషం దాకా తప్పించుకునే ప్రయత్నం చేస్తుంది. చిరుతపులి కూడా ఒంటినిండా తూటాలతోనే వేటగాడికి ఎదురొడ్డి నిలుస్తుంది. ఆకతాయి కుర్రాళ్ల కసిదీరా నలిపేసిన సీతాకోకచిలుక అయినా తెగిన రెక్కలతోనే మొండిగా ఎగరాలని చూస్తుంది. సృష్టిలో ఏ జీవికీ ఆత్మహత్య ఆలోచన రాదు – ఒక్క మనిషికే ఆ విపరీత బుద్ధి! చిన్న సమస్య రాగానే తల్లడిల్లిపోతాడు. చావే నయమన్న భ్రమలో పడిపోతాడు. జీవితంలో వెనక్కి తీసుకోలేనివి రెండే.. ఒకటి కాలం.. మరొకటి ప్రాణం. తొందరపాటు జీవితాన్ని చిదిమేస్తుంది. మనపై ప్రేమను పెంచుకున్న కుటుంబ సభ్యులకు తీరని విషాదాన్ని మిగిలిస్తుంది. గెలవడం ధ్యేయం కావాలి.. కానీ గెలుపే జీవితం కాదు. ఓడినంత మాత్రాన జీవితం వృథా అనుకుంటే భవిష్యత్తు శూన్యంలా కనిపిస్తుంది. ఆత్మవిశ్వాసానికి మించిన విజయం లేదు. ఒక్క క్షణం ఆలోచిస్తే జీవితం విలువ తెలుస్తుంది.

– విశాఖ విద్య

- క్షణికావేశంలో ఆత్మహత్యలు వద్దు
- ఫెయిలవుతామనే ఆందోళనతో ఆత్మహత్య
- పరీక్షలు కాదు, ప్రాణాలు ముఖ్యమంటున్న తల్లిదండ్రులు
- నేడు ఇంటర్మీడియట్ ఫలితాలు
- విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చేలా ఇంటర్ బోర్డు కార్యాచరణ


వార్షిక పరీక్షలు రాసిన విద్యార్థులు

మధురవాడలోని ఓ కార్పొరేట్ కాలేజీలో చదువుతున్న కృష్ణ తేజ క్లాస్‌లో టాపర్. విజయనగరంలో హోటల్ నిర్వహణతో వచ్చే ఆదాయమే కుటుంబ జీవనాధారమైనప్పటికీ, కుమారుడిని ప్రయోజకుడిగా చేయాలనే గంపెడాశతో చదివిస్తున్నారు. కానీ, పరీక్షల్లో మంచి మార్కులు సాధించలేనేమోననే ఆందోళనతో కృష్ణ తేజ ఆత్మహత్యకు ఒడిగట్టాడు. చేతికందొస్తాడుకున్న కొడుకు కళ్లముందు శవమై కనిపించడంతో తల్లి నాగలక్ష్మి కోమాలోకి వెళ్లింది. ఊహించని రీతిలో జరిగిన పరిణామాలతో తండ్రి వెంకటరమణ పరిస్థితి దయనీయంగా మారింది. క్షణికావేశంతో కృష్ణ తేజ చేసిన నిర్వాకం తల్లిదండ్రులకు శాపమైంది. చివరకు ఆ కుటుంబం చిన్నాభిన్నమైంది.

చదువుల్లో రాణించలేకపోతున్నామని, పరీక్షల్లో ఫెయిలయ్యామనే ఆత్మన్యూనతా భావంతో కొంతమంది విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. '2023–24 విద్యా సంవత్సరంలో ఉమ్మడి విశాఖ జిల్లాలో ఏడుగురు విద్యార్థులు ఆత్మహత్య' చేసుకున్నారు. కారణాలేమైనా, ఇలాంటి సంఘటనలన్నీ కార్పొరేట్, ప్రైవేటు కాలేజీల్లోనే చోటుచేసుకుంటున్నాయి. చదువుల ఒత్తిడి తట్టులేక క్షణికావేశంలో విద్యార్థులు తీసుకునే నిర్ణయాలతో తమపై ఎన్నో ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రులు, తోబుట్టువులు ఏమైపోతారనే ఆలోచన చేయడం లేదు. ఇలాంటి ఘటనలకు చెక్ పెట్టేలాని ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఇంటర్మీడియెట్ బోర్డు ఉన్నతాధికారులు కార్యాచరణకు దిగారు. ఫలితాలు ప్రకటిస్తున్నందున, మరింత అప్రమత్తమయ్యేలా దిశానిర్దేశం చేస్తున్నారు.

హలో స్టూడెంట్ ఎలా ఉన్నావ్..

ఆత్మహత్యలకు అడ్డుకట్ట వేసే క్రమంలో ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో ఇప్పటికే నియమితులైన ఐదుగురు సభ్యుల కమిటీ అప్రమత్తమయ్యేలా ఇంటర్మీడియెట్ బోర్డు నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చాయి. పరీక్ష ఫలితాలు విడుదలైన రోజు నుంచే విద్యార్థుల యోగక్షేమాలు తెలుసుకునేలా కార్యాచరణ సిద్ధం చేశారు. ఈ మేరకు కాలేజీలోని తరగతి లేదా సెక్షన్ వారీగా ఇంచార్జిగా వ్యవహరించే అధ్యాపకుడు విద్యార్థులందరినీ ఫోన్‌ద్వారా పరామర్శించనున్నారు. విద్యార్థి లేదా వారి తల్లిదండ్రుల ఫోన్ నంబర్లు కాలేజీలో అందుబాటులో ఉన్నందున, పరీక్షల ఫలితాలు గురించి తెలుసుకోవటంతో పాటు, భవిష్యత్ చదువులపై వారికి అవగాహన కల్పించనున్నారు.

కాలేజీల్లో కౌన్సిలర్లు

2024–25 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కాలేజీలన్నింటిలో తప్పనిసరిగా ఒక కౌన్సిలర్లు నియమించాలని ప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేసింది. ప్రిన్సిపాల్ టీమ్ లీడర్‌గా ఇద్దరు లెక్చరర్లు, కాలేజీ డవలప్‌మెంట్ కమిటీ సభ్యుడు, ఒక విద్యార్థితో కూడిన కమిటీ ప్రతీ కాలేజీలో ఏర్పాటు చేయనున్నారు. ఒక సీనియర్ లెక్చరర్‌ను కౌన్సిలర్‌గా నియమించాల్సి ఉంది. విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఇలా ఎంపిక చేసిన కౌన్సిలర్లకు ఫిబ్రవరిలోవిశాఖ కేంద్రంగా వారం రోజులు ప్రత్యేక శిక్షణ కూడా ఇచ్చారు. విద్యార్థుల ఆత్మహత్యలకు అడ్డుకట్ట వేసేలా కౌన్సిలర్లు ప్రత్యేక బాధ్యత తీసుకోనున్నారు.

అధ్యాపకులు బాధ్యత తీసుకోవాలి



ఫలితాలు ఎలా వచ్చినా, విద్యార్థులు మనోస్థైర్యం కోల్పోవద్దు. పరీక్షలు కాదు, ప్రాణాలు ముఖ్యమనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఒకసారి తప్పినా, ఉన్నత శిఖరాలు అధిరోహించిన వారెందరో ఉన్నారు. ఆత్మహత్యల నివారణకు ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కాలేజీల్లో కౌన్సిలర్లను ఏర్పాటు చేశాం. వీరికి శిక్షణ కూడా ఇచ్చాం. విద్యార్థులకు అవగాహన కల్పించేలా ప్రత్యేక కమిటీలు కూడా పనిచేయనున్నాయి.

– పి. మురళీధర్, ఆర్‌ఐవో, ఉమ్మడి విశాఖ జిల్లా

వైఎస్సార్‌సీపీలోకి 150 కుటుంబాలు



పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

- సాదరంగా ఆహ్వానించిన ఎమ్మెల్యే ముత్తంశెట్టి
- ఎమ్మెల్యే విజయానికి కృషి చేస్తామని వెల్లడి

భీమునిపట్నం : భీమిలి 6వ వార్డు పరిధిలో గొల్లల తాళ్లవలస, గొలగానివారి కల్లాలు ప్రాంతాలకు చెందిన 150 కుటుంబాలు గొలగాని సన్యాసిరావు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరాయి. గురువారం తన క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తంశెట్టి మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం, జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఖాయమైపోయిందని ఇందులో ఎటువంటి సందేహం లేదన్నారు. ఇక్కడ తాను కూడా అందరి సహకారంతో గెలుస్తానని.. ప్రజలను పట్టించుకోని వారిని ఎన్నుకునే పరిస్థితి ఎక్కడా ఉండదన్నారు. ఈ కుటుంబాల పెద్ద గొలగాని సన్యాసిరావు మాట్లాడుతూ తాము ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన, ఎమ్మెల్యే ముత్తంశెట్టిని చూసి పార్టీలోకి వచ్చామని అన్నారు. టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు గతంలో ఎవరికి కనబడలేదని అదే ఎమ్మెల్యే ముత్తంశెట్టి నిత్యం ప్రజల్లో నిత్యం ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తున్నారని తెలిపారు. తామంతా ముత్తంశెట్టి విజయానికి కృషిచేస్తామన్నారు. ఇందులో గొలగాని ఆనంద్, పాసి అప్పల నర్సయ్య, బొబ్బిలి మురళీ, గొలగాని అప్పలనారాయణ, పల్లా బుజ్జీ, గొలగాని శ్రీను, గొలగాని లక్ష్మణ్, గొలగాని రాజు, గొలగాని నాగమణి, గొలగాని గోవింద్ పాల్గొన్నారు.

బడుగుల ఆశాజ్యోతి పూలే


పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీ బాబూరావు, తిప్పల నాగిరెడ్డి, కోలా గురువులు, ముఖ్యనాయకులు


పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఎంపీ బాబూరావు

మహారాణిపేట: బడుగుల ఆశాజ్యోతి జ్యోతిబా పూలే అని కలెక్టర్ మల్లికార్జున అన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ మీటింగ్ హాలులో పూలే జయంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి కలెక్టర్, డీఆర్వో కె.మోహన్ కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామారావు, బీసీ సంక్షేమ శాఖ అధికారి శ్రీదేవి పాల్గొన్నారు.

పూలే సేవలు చిరస్మరణీయం

ఎంవీపీకాలనీ: సమాజ అభివృద్ధికి మహాత్మా జ్యోతిబా పూలే అందించిన సేవలు చిరస్మరణీయమని వైఎస్సార్ సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ అన్నారు. లాసన్స్ బే కాలనీలోని కార్యాలయంలో గురువారం పూలే చిత్రపటానికి ఆమె పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీ గొల్ల బాబూరావు, మేయర్ గొలగాని హరివెంకటకుమారి, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వీఎంఆర్డీఏ చైర్మన్ చంద్రమౌళి, విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు మళ్ల విజయ్‌ప్రసాద్, ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు, డిప్యూటీ మేయర్ కె. సతీష్, ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు, పేడాడ రమణికుమారి, రవిరెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి సీవీ నారాయణ, ఆళ్ల శివగణేష్, శివప్రసాద్, పలువురు కార్పొరేటర్లు, వార్డు ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి చేసిన మహనీయుడు పూలే

కొమ్మాది: విద్యాభివృద్ధికి కృషి చేసిన మహనీయుడు మహాత్మా జ్యోతిబాపూలే అని ఎంపీ గొల్ల బాబూరావు అన్నారు. ఎండాడలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఆ పార్టీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామన్నపాత్రుడు ఆధ్వర్యంలో పూలే జయంతి వేడుకలు జరిగాయి. మేయర్ గొలగాని హరివెంకట కుమారి, పార్టీ డిప్యూటీ రీజనల్ కోఆర్డినేటర్ తిప్పల నాగిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, వీఎంఆర్డీఏ చైర్మన్ సనపల చంద్రమౌళి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవిరెడ్డి, నాయకులు నడింపల్లి కృష్ణంరాజు, వంకాయల మారుతీ ప్రసాద్, అల్లంపల్లి రాజబాబు, బోని శివరామకృష్ణ, యువశ్రీ, కృపాజ్యోతి, పిల్లా సుజాత సత్యనారాయణ, అప్పన్న, మోహన్‌రావు, రోజారాణి పాల్గొన్నారు.

ఉద్యోగం నుంచి బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ తొలగింపు


మూర్తిశ్రీ

భీమునిపట్నం : భీమిలి జోనల్ కార్యాలయంలో బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న మూర్తిశ్రీని ఉద్యోగ విధుల నుంచి తొలగిస్తూ రాష్ట్ర పట్టణాభివృద్ధి, పురపాలక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఆయన ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నాడన్న కారణంతో ఏసీబీ అధికారులు 2006లో సోదాలు నిర్వహించి కేసు నమోదు చేశారు. ఆ కేసు కోర్టులో నడుస్తోంది. తాజాగా ఏసీబీ న్యాయ స్థానంలో ఆ కేసు రుజువు కావడంతో ప్రభుత్వం ఆయన్ని ఉద్యోగం నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

తరగతి గదిలో కుప్పకూలి ఉపాధ్యాయుడి మృతి


రాజేష్ కుమార్ మృతదేహం

తగరపువలస : సంగివలస శశి ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో 8వ తరగతికి ఇంగ్లిష్ బోధిస్తున్న మజ్జి రాజేష్‌కుమార్ అనే ఉపాధ్యాయుడు గురువారం తరగతి గదిలో కుప్పకూలి మృతి చెందాడు. మన్యం జిల్లా పాలకొండ టౌన్ రెల్లివీధికి చెందిన రాజేష్ నాలుగేళ్లుగా శశిలో ఉపాధ్యాయునిగా పని చేస్తున్నాడు. ఎంఏ, బీఈడీ పూర్తి చేసిన రాజేష్‌కుమార్‌కు ప్రభుత్వ ఉద్యోగం లేక అవివాహితుడిగా ఉండిపోయాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన రాజేష్ తరచూ ముభావంగా ఉండేవాడు. దీనికి సంబంధించి మందులు కూడా వాడుతుండేవాడు. ఈ నేపథ్యంలో తరగతి గదిలో కుప్పకూలిన రాజేష్‌కుమార్‌ను చికిత్స కోసం సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యుల నిర్ధారించారు. దీనిపై భీమిలి ఎస్ఐ జి.పైడిరాజు కేసు నమోదు చేశారు.

రుషికొండ బీచ్‌లో యువకుడి గల్లంతు


గల్లంతైన తేజ

కొమ్మాది: స్నేహితులతో సరదాగా గడిపేందుకు రుషికొండ బీచ్‌కు వచ్చిన ఓ యువకుడు గల్లంతయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. కంచరపాలెం ఊర్వశి జంక్షన్‌కు చెందిన తేజ (20) గురువారం సాయంత్రం తన(ఇంటర్) స్నేహితులు జి.సృజన్, జి.హర్ష, వంశీ, సాయి వెంకట్, ప్రణీత్‌లతో కలసి రుషికొండ బీచ్‌కు వచ్చాడు. బీచ్‌లో సుమారు మూడు గంటల పాటు సరదాగా గడిపి ఫొటోలు తీసుకున్నారు. రాత్రి 7 గంటల సమయంలో ఈ ఆరుగురు స్నేహితులు రుషికొండ బీచ్‌కు కాస్త దూరం వెళ్లి స్నానాలకు దిగారు. ఈ క్రమంలో పెద్ద కెరటం ఒక్కసారిగా రావడంతో తేజ సముద్రంలోకి కొట్టుకు పోయాడు. స్నేహితులు కాపాడేందుకు ప్రయత్నించి, పెద్దగా కేకలు వేసినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. ఇది గమనించిన లైఫ్‌గార్డ్స్ ఘటనా స్థలానికి చేరుకుని గాలించినప్పటికీ తేజ ఆచూకీ లభ్యం కాలేదు. తేజ అమరావతి విట్స్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం ఈసీఈ అభ్యసిస్తున్నాడు. తండ్రి కేఎల్ యూనివర్సిటీలో అధ్యాపకుడిగా పని చేస్తున్నారు. సంఘటనా స్థలానికి ఆరిలోవ సీఐ గోవిందరావు చేరుకుని బ్లూకోర్టు పోలీసులతో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

ముందే హెచ్చరించిన పోలీసులు: ఆరుగురు స్నేహితులు రుషికొండ బీచ్‌లో స్నానాలు చేసేందుకు సముద్రంలో దిగుతుండగా చీకటి కావడంతో వెనక్కి రావాలంటూ పోలీసులు హెచ్చరించారు. దీంతో వీరు కాస్త దూరంగా వెళ్లి స్నానాలు చేయడంతో ప్రమాదం ముంచుకొచ్చింది. వీరు వెళ్లిన తీర ప్రాంతం ప్రమాదకర ప్రాంతం కావడంతో తేజ గల్లంతయ్యాడని లైఫ్‌గార్డ్స్ తెలిపారు. పోలీసులు తేజ తల్లిదండ్రులకు సమాచారం అందజేసి కేసు నమోదు చేశారు.

గుడివాడ కుటుంబంతోనే పారిశ్రామిక అభివృద్ధి

వాసీవా మాజీ అధ్యక్షుడు రామకృష్ణ


వాసీవా భవనంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్


హాజరైన ఆటోనగర్ పారిశ్రామిక వేత్తలు

అక్కిరెడ్డిపాలెం : గాజువాకను పారిశ్రామికంగా అభివృద్ధి చేసింది గుడివాడ కుటుంబమని ఆటోనగర్ స్మాల్‌స్కేల్ ఇండస్ట్రియలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ (వాసీవా) మాజీ అధ్యక్షుడు, సీనియర్ పారిశ్రామిక వేత్త రామకృష్ణ నారపురెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంత్రి, గాజువాక వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ గురువారం సాయంత్రం ఆటోనగర్ వాసీవా భవనంలో పారిశ్రామిక వేత్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నారపురెడ్డి మాట్లాడుతూ ఆటోనగర్‌కు గుడివాడ కుటుంబానికి అవినాభావ సంబంధం ఉందన్నారు. అమర్‌నాథ్ తాత గుడివాడ అప్పన్న పెందుర్తి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో పరిశ్రమల అభివృద్ధికి ఎంతో సహకరించారని గుర్తు చేశారు. మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ తన తండ్రి ఏపీఐఐసీ కాంట్రాక్టర్‌గా, రాష్ట్ర మంత్రిగా పారిశ్రామిక అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. బీహెచ్ పీవీ, స్టీల్‌ప్లాంట్, జింక్ వంటి పరిశ్రమల స్థాపన సమయంలో తమ భూములు కోల్పోయామన్నారు.

పరిశ్రమల రాకతో యువతకు ఉపాధి లభిస్తుందన్న ఆశతో తమ భూములు ధారదత్తం చేశామన్నారు. నిర్మాణంలో ఉన్న ఆటోనగర్‌లోని ఆర్‌వోబీని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి విశాఖ పర్యటన సమయంలో హెలీకాప్టర్ నుంచి వీక్షించారన్నారు. దీనిపై ప్రత్యేక దృష్టి సారించి వివరాలు సేకరించి వెంటనే ఆర్‌వోబీ నిర్మాణానికి సత్వర చర్యలు తీసుకున్నారన్నారు. రాష్ట్రంలోనే గాజువాకకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. పుట్టి పెరిగి ప్రాంతంలో తనకు ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి కల్పించడం అదృష్టంగా భావిస్తున్నానని ఆనందం వ్యక్తం చేశారు. తన కుటుంబం యావత్తు పరిశ్రమల స్థాపనకు ఎంతో సేవలు చేసిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. విశాఖకు దీటుగా గాజువాకను అభివృద్ధి చేస్తామన్నారు. గాజువాక మ్యానిఫెస్టోను శ్రీ రామనవమి రోజున విడుదల చేస్తామని తెలిపారు. పలువురు సీనియర్ పారిశ్రామిక వేత్తల సలహాలు, సూచనలు పరిగణలోకి తీసుకుంటామన్నారు. పారిశ్రామిక వేత్తలు, వారి కంపెనీల్లో పని చేస్తున్న కార్మికులు, ఉద్యోగులు, వారి కుటుంబాలు ఫ్యాన్ గుర్తుపై ఓటేసి తనను, ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీని గెలిపించాలని అమర్‌నాథ్ విజ్ఞప్తి చేశారు. అనంతరం పలువురు పారిశ్రామిక వేత్తలు అమర్‌నాథ్‌ను సత్కరించారు. కార్యక్రమంలో వీఎంఆర్డీఏ చైర్మన్ చంద్రమౌళి, ఐలా చైర్మన్ కె.సత్యనారాయణ రెడ్డి (రఘు), వైస్ చైర్మన్ కొల్లి ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శి చీకటి సత్యనారాయణ, వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండురంగ ప్రసాద్, కార్యదర్శి రాంప్రసాద్, ఐలా మెంబర్ డి.కుమార్ రెడ్డి, లఘు ఉద్యోగ భారత్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.కె. బాలాజి, సీనియర్ పారిశ్రామిక వేత్తలు కోటేశ్వరరావు, పెదగంట్యాడ అధ్యక్షుడు సత్యనారాయణ, కోడా రాజారావు, వై.సాంబశివరావు, పలువురు పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు.

చావో.. రేవో తేల్చుకుంటాం

- గంగవరం పోర్టు కార్మికుల ఆందోళన


రైల్వే ట్రాక్‌పై నిరసన తెలుపుతున్న కార్మికులు

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టులో పనిచేస్తున్న కార్మికులు గురువారం కూడా ఆందోళనకు దిగారు. పోర్టు వద్ద గల రైల్వే ట్రాక్ పై బైఠాయించి చావో రేవో తేల్చుకుందామని పోర్టు యాజమాన్యాన్ని హెచ్చరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న కార్మికులు మృత్యువాత పడితే వెంటనే రూ.25లక్షలు ఇవ్వాలని లేని పక్షంలో నష్టపరిహారం కింద రూ.50 లక్షలు ఇచ్చి వన్‌టైమ్ సెటిల్‌మెంట్ చేయాలని డిమాండ్ చేశారు. గాయపడితే కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స అందించాలన్నారు. లేనిపక్షంలో పోర్టును ఇక్కడి నుంచి తరలించాలన్నారు. ఆందోళనపై సమాచారం అందుకున్న న్యూ పోర్టు పోలీసులకు సంఘటనా స్థలానికి చేరుకుని కార్మికులతో చర్చించారు. ఆర్డీవోతో కార్మికులకు సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పారు. అప్పటి వరకు రైల్వే ట్రాక్‌పై నిరసన విరమించాలన్నారు.

ప్రయాణికుల కోసం స్పెషల్ రైళ్లు

తాటిచెట్లపాలెం : వేసవి రద్దీ దృష్ట్యా ప్రయాణికుల కోసం ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

➡ సూరత్ – బ్రహ్మపూర్ (09069) స్పెషల్ సూరత్‌లో ఈ నెల 17, 24, మే 1, 8, 15, 22, 29, జూన్ 5, 12, 19, 26న (బుధవారాల్లో) మధ్యాహ్నం 2.20 గంటలకు బయల్దేరి మరుసటిరోజు రాత్రి 8.10 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 8.12 గంటలకు బయల్దేరి మరుసటి రోజు తెల్లవారుజామున 1.15 గంటలకు బ్రహ్మపూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో బ్రహ్మపూర్‌లో ఈ నెల 19, 26, మే 3, 10, 17, 24, 31, జూన్ 7, 14, 21, 28న (శుక్రవారాల్లో) తెల్లవారుజామున 3.30 గంటలకు బయల్దేరి ఉదయం 8.20 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 8.22 గంటలకు బయల్దేరి మరుసటిరోజు మధ్యాహ్నం 1.45 గంటలకు సూరత్ చేరుకుంటుంది.

➡ నాగర్ కోయల్ – డిబ్రూగఢ్ (06103) సూపర్ ఫాస్ట్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 12, 26, మే 10, 24న (శుక్రవారాల్లో) నాగర్‌కోయల్‌లో సాయంత్రం 5.45 గంటలకు బయల్దేరి మరుసటిరోజు రాత్రి 11.18 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 11.20 గంటలకు బయల్దేరి సోమవారం రాత్రి 8.50 గంటలకు డిబ్రూఘడ్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో డిబ్రూఘడ్

➡ నాగర్‌కోయల్ (06104) సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ డిబ్రూగఢ్‌లో ఈ నెల 17, మే 1, 15, 29న (బుధవారాల్లో) రాత్రి 7.55 గంటలకు బయల్దేరి మూడో రోజు సాయంత్రం 4.28 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 4.30 గంటలకు బయల్దేరి శనివారం రాత్రి 9.30 గంటలకు నాగర్‌కోయల్ చేరుకుంటుంది.

➡ ఎస్‌ఎంవీ బెంగళూరు-ఖరగ్‌పూర్ (06507) స్పెషల్ ఈ నెల 12, 19, 26, మే 3, 10, 17న (శుక్రవారాల్లో) బెంగళూరులో మధ్యాహ్నం 3.50 గంటలకు బయల్దేరి మరుసటిరోజు మధ్యాహ్నం 12 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 12.02 గంటలకు బయల్దేరి మరుసటిరోజు తెల్లవారుజామున 2.45 గంటలకు ఖరగ్‌పూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఖరగ్‌పూర్ – ఎస్‌ఎంవీ బెంగళూరు (06508) స్పెషల్ ఈ నెల 15, 22, 29, మే 6, 13, 20న (సోమవారాల్లో) ఖరగ్‌పూర్‌లో మధ్యాహ్నం 2 గంటలకు బయల్దేరి మరుసటి రోజు తెల్లవారుజామున 2.38 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 2.40 గంటలకు బయల్దేరి అదే రోజు రాత్రి 7.50 గంటలకు బెంగళూరు చేరుకుంటుంది.